ముక్కోణపు విజేత భారత్

ఫైనల్‌లో శ్రీలంకపై ఘనవిజయం

స్మృతి మంధాన శతక జోరు

మెరిసిన స్నేహ్ రాణా, అమన్‌జ్యోత్

మంధాన (116)

కొలంబో: మరికొద్దిరోజుల్లో స్వదేశంలో జరుగనున్న మహిళల వన్డే ప్రపంచకప్‌నకు ముందు భారత జట్టుకు అద్భుత విజయం. శ్రీలంక, దక్షిణాఫ్రికాతో కొలంబోలోని ప్రేమదాస స్టేడియంలో జరిగిన ముక్కోణపు సిరీస్‌ను టీమ్‌ఇండియా గెలుచుకుంది. ఫైనల్‌లో హర్మన్‌ప్రీత్ కౌర్ సేన.. 97 పరుగుల తేడాతో ఆతిథ్య శ్రీలంకపై ఘనవిజయం సాధించి ముక్కోణపు సిరీస్ విజేతగా నిలిచింది. బ్యాటింగ్‌లో స్మృతి మంధాన (101 బంతుల్లో 116, 15 ఫోర్లు, 2 సిక్సర్లు) తన కెరీర్‌లో 11వ శతకంతో విజృంభించగా మిగిలిన బ్యాటర్లూ సమిష్టిగా రాణించడంతో నిర్ణీత ఓవర్లలో భారత జట్టు 7 వికెట్లు నష్టపోయి 342 పరుగుల భారీ స్కోరు చేసింది. కొండంత లక్ష్య ఛేదనలో భారత బౌలర్లు స్నేహ్ రాణా (4/38), అమన్‌జ్యోత్ కౌర్ (3/54) మెరవడంతో లంకేయులు 48.2 ఓవర్లలో 245 పరుగులకే కుప్పకూలారు. కెప్టెన్ చమరి ఆటపట్టు (51) టాప్ స్కోరర్. ఫైనల్‌లో శతకం బాదిన మంధానకు 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కగా సిరీస్ ఆద్యంతం రాణించి 15 వికెట్లు పడగొట్టిన స్నేహ్ రాణాకు 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' లభించింది.

బ్యాటర్ల సమిష్టి ప్రదర్శన

ఫైనల్‌లో టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ ఎంచుకున్న భారత్.. ఆరంభం నుంచే దూకుడుగా ఆడింది. వన్డేలలో సూపర్ ఫామ్‌లో ఉన్న ఓపెనర్లు ప్రతీక (30), మంధాన తొలి వికెట్‌కు 70 పరుగులు జోడించి బలమైన పునాది వేశారు. 15వ ఓవర్లో ప్రతీకను రణవీర ఔట్ చేసినా హర్లీన్ డియోల్ (47)తో జతకలిసిన మంధాన స్కోరుబోర్డును పరుగులు పెట్టించింది. అర్ధ శతకం తర్వాత లంక స్పిన్నర్లపై బౌండరీలతో విరుచుకుపడ్డ ఆమె.. రెండో వికెట్‌కు హర్లీన్‌తో 120 రన్స్ జతచేసింది. ఆటపట్టు వేసిన 31వ ఓవర్లో హ్యాట్రిక్ ఫోర్లతో 92 బంతుల్లోనే మంధాన శతకం పూర్తయింది. సెంచరీ తర్వాత మంధాన, హాఫ్ సెంచరీకి మూడు పరుగుల దూరంలో హర్లీన్ నిష్క్రమించినా హర్మన్‌ప్రీత్ (47), జెమీమా (44) వేగంగా ఆడటంతో 45 ఓవర్లకే భారత్ 300 పరుగుల మైలురాయిని దాటింది. ఆఖర్లో దీప్తి (20 నాటౌట్), అమన్‌జ్యోత్ (18) మెరుపులతో టీమ్‌ఇండియా రికార్డు స్కోరు చేసింది.

లంక విఫలం

ఛేదనలో స్కోరుబోర్డుపై పరుగులేమీ చేరకుండానే తొలి వికెట్ కోల్పోయిన లంకను కెప్టెన్ ఆటపట్టు, విష్మి (36) ఆదుకున్నారు. అమన్‌జ్యోత్ ఆరంభ ఓవర్లోనే లంకను దెబ్బతీసింది. ఆటపట్టు, విష్మి జోడీ రెండో వికెట్‌కు 68 రన్స్ జోడించింది. ఈ జోడీని అమన్‌జ్యోత్ 14వ ఓవర్లో విడదీసి భారత్‌కు బ్రేక్ ఇచ్చింది. ఆటపట్టును స్నేహ్ రాణా క్లీన్‌బౌల్డ్ చేసింది. మిడిలార్డర్‌లో నీలాక్షి (48), హర్షిత (26) కొద్దిసేపు ప్రతిఘటించినా రాణాతో పాటు శ్రీ చరణి స్పిన్ మాయాజాలంతో లంక కోలుకోలేకపోయింది.

సంక్షిప్త స్కోర్లు

భారత్: 50 ఓవర్లలో 342/7 (మంధాన 116, హర్లీన్ 47, సుగంధిక 2/59, విహంగ 2/69); **శ్రీలంక:** 48.2 ఓవర్లలో 245 ఆలౌట్ (చమరి 51, నీలాక్షి 48, రాణా 4/38, అమన్‌జ్యోత్ 3/54)

నీరజ్‌తో మరో ముగ్గురు..

దోహా(ఖతార్): మరో నాలుగు రోజుల్లో దోహా వేదికగా జరుగబోయే డైమండ్ లీగ్ పోటీలలో భారత స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రాతో పాటు మరో ముగ్గురు అథ్లెట్లు పాల్గొననున్నారు. పురుషుల జావెలిన్ త్రోలో నీరజ్, కిషోర్ జెన బరిలోకి దిగనుండగా.. పురుషుల 5000 మీటర్ల రేసులో గుల్వీర్ సింగ్, మహిళల 3 వేల మీటర్ల స్టీపుల్ ఛేజ్‌లో పారుల్ చౌదరి తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు.

పాంటింగ్ చివరి నిమిషంలో..

ఢిల్లీ: సరిహద్దుల్లో యుద్ధ వాతావరణం, ఐపీఎల్ వాయిదా తర్వాత ఆయా జట్లలో విదేశీ ఆటగాళ్లు, కోచ్‌లు తమ స్వస్థలాలకు వెళ్లేందుకు మొగ్గు చూపగా పంజాబ్ కింగ్స్ హెడ్‌కోచ్ రికీ పాంటింగ్ మాత్రం.. ఫ్లైట్ ఎక్కినా చివరి నిమిషంలో మనసు మార్చుకున్నాడు. పాంటింగ్ విమానంలో ఉండగానే భారత్, పాక్ కాల్పుల విరమణ ప్రకటన చేయడంతో ఈ ఆసీస్ దిగ్గజం అప్పటికప్పుడు తన నిర్ణయాన్ని మార్చుకున్నాడు. తాను దిగిపోవడమే గాక ఆస్ట్రేలియాకు చెందిన స్టోయినిస్, హార్డీ, ఇంగ్లిస్, బార్ట్‌లెట్‌నూ స్వదేశానికి వెళ్లకుండా ఆపాడని.. వారికి భరోసానిచ్చి భారత్‌లోనే ఉండేవిధంగా ఒప్పించాడని కింగ్స్ సీఈవో సతీశ్ మీనన్ తెలిపాడు.

16న పున:ప్రారంభం!

నేడు షెడ్యూల్ వెలువడే అవకాశం • ఫైనల్ వేదిక మార్పు?

ఢిల్లీ: భారత్, పాకిస్థాన్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతలతో వారం రోజుల పాటు వాయిదాపడిన ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)ను పున:ప్రారంభించాలనే సంకల్పంతో ఉన్న భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ).. ఈనెల 16 నుంచి లీగ్‌ను తిరిగి ప్రారంభించేందుకు సిద్ధమవుతున్నది. దాయాది దేశాలు కాల్పుల విరమణ ఒప్పందం ప్రకటించిన తర్వాత తాజా సీజన్‌ను వీలైనంత త్వరగా పూర్తిచేయాలనే పట్టుదలతో ఉన్న బీసీసీఐ.. ఈ మేరకు ఆదివారం ఢిల్లీలో ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ సభ్యులతో సమావేశమైంది. బోర్డు వర్గాల సమాచారం ప్రకారం ఈనెల 16 లేదా 17న లీగ్‌ను తిరిగి ఆరంభించాలని యోచిస్తున్నది. మే 9న లక్నో-బెంగళూరు మ్యాచ్‌కు ముందు వాయిదాపడ్డ ఐపీఎల్-18ను మళ్లీ అదే మ్యాచ్‌తో మొదలుపెట్టనున్నట్టు తెలుస్తున్నది. అలాగే ఫైనల్ వేదికను ఈడెన్ గార్డెన్స్ (కోల్‌కతా) నుంచి అహ్మదాబాద్‌కు మార్చనున్నట్టు సమాచారం. ఎట్టిపరిస్థితుల్లోనూ మే 30 లేదా జూన్ 1 నాటికి ఈ సీజన్‌ను పూర్తిచేయాలని బీసీసీఐ భావిస్తున్నట్టు బోర్డు వర్గాలు తెలిపాయి. కొత్త షెడ్యూల్, వేదికలకు సంబంధించిన వివరాలను సోమవారం ప్రకటించే అవకాశముంది.

ఆదివారం సమావేశం ముగిసిన తర్వాత బీసీసీఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా మాట్లాడుతూ.. 'బీసీసీఐ సెక్రటరీ, ఐపీఎల్ చైర్మన్ ఫ్రాంచైజీలతో మాట్లాడుతున్నారు. ఐపీఎల్ పునరుద్ధరణకు సంబంధించి త్వరలోనే నిర్ణయం తీసుకుంటాం' అని అన్నారు. లీగ్ వాయిదాతో పలువురు విదేశీ ఆటగాళ్లు తమ స్వస్థలాలకు పయనమైన నేపథ్యంలో ఫ్రాంచైజీలన్నీ వారిని ఒప్పించి మంగళవారం (మే 13) నాటికి వారి హోంగ్రౌండ్‌కు వచ్చేలా చూసుకోవాలని ఆయా జట్లకు బీసీసీఐ సూచించినట్టు బోర్డు ప్రతినిధి ఒకరు తెలిపారు. వేదికలకు సంబంధించి.. ప్లేఆఫ్స్ షెడ్యూల్‌లో ఫైనల్ మ్యాచ్‌కు మినహా హైదరాబాద్‌లో జరగాల్సిన క్వాలిఫయర్, ఎలిమినేటర్ యథావిధిగా జరుగనుంది. ఒకవేళ మే 30 లేదా జూన్ 1న ఫైనల్‌ను నిర్వహిస్తే అదే సమయానికి కోల్‌కతాలో వర్షం పడే అవకాశాలు మెండుగా ఉన్న నేపథ్యంలో తుదిపోరును అహ్మదాబాద్‌లో ఆడించనున్నట్టు సమాచారం.

ముగిసిన ఖైదీల క్రీడలు

ఓవరాల్ చాంపియన్‌గా చర్లపల్లి జైలు ఖైదీలు

హైదరాబాద్, మే 11 (నమస్తే తెలంగాణ): చర్లపల్లి సెంట్రల్ జైలు ఆవరణలో మూడు రోజులపాటు జరిగిన ఖైదీల రాష్ట్రస్థాయి క్రీడా, సాంస్కృతిక పోటీలు ఆదివారం ముగిశాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. క్షణికావేశంలో చేసిన నేరానికి ఏండ్లపాటు కుటుంబానికి దూరంగా ఉండాల్సి వస్తుందని, శాంతియుత జీవనం అలవర్చుకుంటే కుటుంబం, సమాజంతో సంతోషంగా ఉండవచ్చని సూచించారు. రాష్ట్రంలోని నాలుగు ప్లాటూన్స్ నుంచి 220 మంది ఖైదీలకు వాలీబాల్, క్రికెట్, కబడ్డీ, చెస్, క్యారమ్స్, పాటలు, డ్యాన్స్, 100, 800 మీటర్ల పరుగులో పోటీలు నిర్వహించారు. చర్లపల్లి సెంట్రల్ జైలు, చంచల్‌గూడ సెంట్రల్ జైలు, హైదరాబాద్, వరంగల్ పరిధిలోని ఖైదీలు పాల్గొన్న పోటీల్లో.. చర్లపల్లి సెంట్రల్ జైలు ఖైదీలు 6 బంగారు పతకాలు, 3 రజత పతకాలతో ఓవరాల్ చాంపియన్‌గా నిలిచారు. చంచల్‌గూడ సెంట్రల్ జైలు ఖైదీలు 4 బంగారు పతకాలు, 1 రజత పతకంతో రన్నరప్‌గా నిలిచారు. కార్యక్రమంలో జైళ్ల శాఖ డీజీ సౌమ్యమిశ్రా, ఐజీలు రాజేశ్, మురళి, డీఐజీలు సంపత్, శ్రీనివాస్, జైలు సూపరింటెండెంట్ శివకుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

దీపిక, పార్థ్‌కు కాంస్యాలు

- **ఆర్చరీ ప్రపంచకప్**

షాంఘై (చైనా): ఆర్చరీ ప్రపంచకప్‌లో భాగంగా శనివారం ఒకేరోజు ఏకంగా ఐదు పతకాలతో దుమ్మురేపిన కాంపౌండ్ ఆర్చర్లు ఇచ్చిన స్ఫూర్తితో రికర్వ్ ఆర్చర్లూ సత్తాచాటారు. ఆదివారం జరిగిన రికర్వ్ వ్యక్తిగత విభాగాల్లో భారత సీనియర్ ఆర్చర్ దీపికా కుమారితో పాటు పురుషుల సింగిల్స్‌లో పార్థ్ సుశాంత్ కాంస్యాలతో మెరిశారు. ఈ ఇద్దరూ ఆదివారం ముగిసిన రికర్వ్ సెమీస్ మ్యాచ్‌లలో ఓడినప్పటికీ కాంస్య పోరులో మాత్రం పుంజుకుని పతకాలు ఖాతాలో వేసుకున్నారు. మహిళల రికర్వ్ సెమీస్‌లో దీపిక.. 1-7తో లిమ్ సిహ్యోన్ చేతిలో ఓడినప్పటికీ.. కాంస్య పోరులో 7-3తో కొరియాకే చెందిన కంగ్ చె యంగ్‌ను ఓడించింది. తొలి సెట్‌లో ఇరువురు ఆర్చర్లు 27 పాయింట్లతో స్కోరు సమం అయినా రెండో సెట్ నుంచి దీపిక పుంజుకుంది. ఒత్తిడిలోనూ గురితప్పని లక్ష్యంతో బాణాలను సంధించి పతకాన్ని ఖాయం చేసుకుంది. ఇక పురుషుల విభాగంలో పార్థ్.. సెమీస్‌లో పరాభవం పాలైనా కీలకమైన కాంస్య పోరులో మాత్రం గురి తప్పలేదు. పార్థ్ 6-4తో బాప్టిస్టె అడిస్ (ఫ్రాన్స్)ను ఓడించి ప్రపంచకప్‌లో తొలి పతకాన్ని ఖాతాలో వేసుకున్నాడు. ఈ టోర్నీని భారత్ మొత్తం ఏడు పతకాలతో ముగించింది.

హాజిల్‌వుడ్‌కు గాయం

తిరిగి రావడం కష్టమే!.. ఆర్‌సీబీకి ఎదురుదెబ్బ

బెంగళూరు: ఐపీఎల్-18లో సమిష్టి ప్రదర్శనతో టైటిల్ రేసులో ఒకటిగా ఉన్న రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ)కు ఎదురుదెబ్బ తగిలింది. టోర్నీలో ఇప్పటివరకూ బెంగళూరు విజయాల్లో కీలకపాత్ర పోషించిన స్టార్ పేసర్ జోష్ హాజిల్‌వుడ్ గాయంతో టోర్నీ మొత్తానికి దూరమవనున్నట్టు తెలుస్తున్నది. ఈనెల 3న చిన్నస్వామి స్టేడియంలో చెన్నై సూపర్ కింగ్స్‌తో మ్యాచ్‌కు ముందు భుజం గాయంతో తప్పుకున్న హాజిల్‌వుడ్.. బీసీసీఐ ఈ లీగ్‌ను వారం రోజుల పాటు వాయిదా వేయడంతో ఆస్ట్రేలియాకు వెళ్లిపోయాడు. ఈ ఆసీస్ పేసర్ ఇంకా పూర్తిస్థాయిలో కోలుకోకపోగా వచ్చేనెలలో ఆ జట్టు.. దక్షిణాఫ్రికాతో కీలకమైన వరల్డ్ టెస్ట్ చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) ఫైనల్ ఆడనున్న నేపథ్యంలో క్రికెట్ ఆస్ట్రేలియా (సీఏ) అతడిపై రిస్క్ తీసుకోదలుచుకోకూడదన్న అభిప్రాయంలో ఉంది. దీంతో అతడు తిరిగి రావడం కష్టమేనని ఆర్‌సీబీ వర్గాలు చెబుతున్నాయి.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.